క్లుప్తంగా

సైనిక్ స్కూల్ ఎంట్రెన్స్‌లో ప్రతిభ



అనుదీప్ సాయి

పలమనేరు: ఇటీవల వెలువడిన సైనిక్‌స్కూల్ ఎంట్రెన్స్‌లో పట్టణంలోని సాయినగర్‌కు చెందిన జ్యోతీశ్వర్ కుమారుడు అనుదీప్ సాయి 300 మార్కులకు 262 సాధించి ప్రతిభ చాటాడు. దీంతో ఆ విద్యార్థిని స్థానికులు అభినందించారు.

ఘనంగా తిరంగా ర్యాలీ



తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కుప్పం: పెహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్‌పై మనదేశం నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం తిరంగా ర్యాలీ ఘనంగా నిర్వహించారు. శుక్రవారం పట్టణం చెరువు కట్ట నుంచి జాతీయ జెండాలను చేతపట్టి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

బంగారుపాళెం ఎంపీడీఓగా మహేష్

బంగారుపాళెం: మండల అభివృద్ధి అధికారిగా మహేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. బైరెడ్డిపల్లె ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓగా విధులు నిర్వహిస్తున్న ఆయన పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఏఓగా పనిచేస్తున్న శ్రీధర్ ఇన్‌చార్జి ఎంపీడీఓగా ఇప్పటివరకు వ్యవహరించారు. బాధ్యతలు చేపట్టిన నూతన ఎంపీడీఓ మహేష్‌ను కార్యాలయ సిబ్బంది, గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంఘం సభ్యులు, గ్రామ కార్యదర్శులు, వివిధశాఖల అధికారులు అభినందించారు. అందరి సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

వరసిద్ధునికి విరాళం

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలోని ట్రస్టులకు ఓ దాత శుక్రవారం రూ. 2.50 లక్షల నగదు విరాళం చేశారు. తమిళనాడులోని చెన్నైకి చెందిన అనికుమార్, సునీత రూ.1.25 లక్షలు, నిత్యఅన్నదానానికి రూ.1.25 లక్షలు గోసంరక్షణ ట్రస్టుకు అందజేశారు. ఈ నగదును ఏఈవో రవీంద్రబాబుకు అందజేశారు. అనంతరం వారికి స్వామి ప్రత్యేక దర్శనం కల్పించి ప్రసాదం అందజేశారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

బంగారుపాళెం: మండలంలోని పిడివి కండ్రిగకు చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని నలగాంపల్లె పంచాయతీ పిడివి కండ్రిగ గ్రామానికి చెందిన కీర్తిశ్రీ (19) గురువారం మధ్యాహ్నం నుంచి కనిపించడం లేదన్నారు. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల ఇళ్లలో వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో శుక్రవారం రాత్రి యువతి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మహిళల చేతివృత్తులకు ప్రోత్సాహం

తవణంపల్లె: నిరుద్యోగ మహిళలకు చేతివృత్తుల ద్వారా జీవనోపాధి కల్పించేందుకు కుట్టుమిషన్ ద్వారా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా మహిళలకు 90 రోజుల పాటు కుట్టుమిషన్లతో టైలరింగ్, ఎంబ్రాయిడింగ్‌లో శిక్షణ ఇస్తున్నారు. ఇందు కోసం 25 కుట్టుమిషన్‌లను సచివాలయంలో ఏర్పాటు చేశారు. మండలంలోని 17 సచివాలయాల ద్వారా శిక్షణకు ఆసక్తి కలిగిన 120 మంది మహిళలను ఎంపిక చేసి శిక్షణకు అవకాశం కల్పించారు. 90 రోజుల పాటు టైలరింగ్‌లో శిక్షణ పొందిన వారికి మాత్రమే ఉచితంగా కుట్టుమిషన్లు, సర్టిఫికెట్లు అందజేస్తారు. శిక్షణలో గైర్హాజరైతే ఉచిత కుట్టుమిషన్లకు అర్హత కోల్పోతారు.

మహిళలకు మంచి అవకాశం

బీసీ కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగ మహిళలకు జీవనోపాధి కల్పించాలనే సంకల్పంతో టైలరింగ్‌లో శిక్షణ ఇస్తున్నాం. మహిళలు ఉత్సాహంగా 90 రోజులు శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఉచితంగా కుట్టుమిషన్లతో పాటు సర్టిఫికేట్ అందజేస్తాం. నిరుద్యోగ మహిళలకు ఇది మంచి అవకాశం. దీన్ని సద్వినియోగం చేసుకోవాలి.

–శ్రీదేవి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, బీసీ కార్పొరేషన్, చిత్తూరు

లేదు వాసి..అంతా నాసి!

పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లో ఎస్సీ హాస్టళ్లలో మౌలిక సదుపాయాల కల్పన, అవసరమైన మైనర్ రిపేర్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.1.83 కోట్లను మంజూరు చేసింది. ఈ పనులను ఆయా మండలాల్లోని కూటమి నేతలు దక్కించుకుని కాంట్రాక్టర్ల అవతారం ఎత్తారు. ఈ పనులకు నాసిరకంగా చేస్తున్నారనే విమర్శలొస్తున్నాయి.

- ఎస్సీ హాస్టళ్ల మరమ్మతుల్లో నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలు
- పలమనేరు, కుప్పంలో హాస్టళ్ల మరమ్మతులకు రూ.1.83కోట్లు
- పనులన్నీ దక్కించుకున్న ఆయా ప్రాంతాల కూటమి నేతలు
- పనులపై కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- కాంట్రాక్టర్లకు మేలు కలిగేలా వ్యవహరిస్తున్న అధికారులు





పలమనేరు ఎస్సీ హాస్టల్ వద్ద గేటును ఏర్పాటు చేస్తున్న దృశ్యం , పట్టణంలోని బాలికల ఎస్సీ హాస్టల్ వద్ద చేస్తున్న పనులు

పలమనేరు: మొన్నటి వరకూ సంక్షేమ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు చాలా ఇబ్బందులు పడ్డారు. సాక్షి దినపత్రిక హాస్టళ్ల సమస్యలపై పలు కథనాలు ప్రచురించింది. ఆపై ప్రభుత్వం స్పందించింది. ఆయా హాస్టళ్లలో మైనర్ రిపేర్లైన బాత్‌రూమ్‌లు, టాయ్‌లెట్లు, నీటి సౌకర్యం, ఫ్యాన్లు, కిటికీలకు మెష్‌లు, ప్రహరీగోడలు, లీకేజీ రూఫ్స్, సున్నం కొట్టడం తదితర పనుల కోసం పలమనేరు పరిధిలో 4, కుప్పం పరిధిలోని 8 హాస్టళ్లకు కలిపి మొత్తం రూ.1.83కోట్లను గత నెల ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ పనులను జూన్ 14లోపు పూర్తి చేయాల్సి ఉంటుంది. వీటిపై పర్యవేక్షణ పంచాయతీ రాజ్, ఆర్‌అండ్‌బీ అధికారులకు అప్పగించారు.

నిబంధనలు ఏమిటంటే..!

ఆయా హాస్టళ్లలో అవసరమైన సౌకర్యాలు కల్పించాలని వాటి వివరాలను గతంలో వార్డెన్లు సాంఘిక సంక్షేమశాఖకు పంపారు. దీంతో నిధులు మంజూరై పనులు సాగుతున్నాయి. ఈ పనులకు వాడుతున్న కమ్మీ, సిమెంట్, వస్తువులను ఆయా పర్యవేక్షణ శాఖలతోపాటు, సాంఘిక సంక్షేమశాఖ ఎస్‌డబ్ల్యూఓలు పనుల నాణ్యతపై పరిశీలించాల్సి ఉంటుంది.

కాంట్రాక్టర్ల అవతారమెత్తిన కూటమి నేతలు

సంక్షేమ హాస్టళ్ల మరమ్మతులకు సంబంధించి ఎలాంటి ఇబ్బంది లేకుండా బిల్లులు వస్తున్నట్టు తెలుసుకున్న ఆయా మండలాల అధికార పార్టీ నేతలు పనులను దక్కించుకున్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.

అంతా వారి ఇష్టం

అధికార పార్టీ నాయకులే ఈ పనులను చేస్తుండడంతో సంబంధిత హాస్టల్ వార్డెన్లు ఏమైనా మాట్లాడితే.. ఇక్కడే ఉద్యోగం చేయాలా లేదా వెళ్లిపోతావా? అని కాంట్రాక్టర్లు వార్నింగ్ ఇస్తుండడంతో ఎందుకొచ్చిన తలనొప్పి అని వారు అస్సలు పట్టించుకోవడం లేదు. మరోవైపు ఏఎస్‌డబ్ల్యూఓలు ఆయా వార్డెన్లు చూసుకోవాలంటూ చేతులు దులుపుకున్నారు. ఇక పర్యవేక్షించాల్సిన పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ అధికారులు సైతం కాంట్రాక్టర్ల మాటను జవదాటడం లేదు. వెరసి నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదు.



పలమనేరు మండలంలోని కొలమాసనపల్లె ఎస్సీ హాస్టల్‌లో మరుగుదొడ్లకు వేసిన దోర్లు



కొలమాసనపల్లె ఎస్సీ హాస్టల్ కిటికీలకు ఏర్పాటు చేస్తున్న దోమ తెరలు

పలుచోట్ల నాసిరకంగా పనులు

బైరెడ్డిపల్లె ఎస్సీ హాస్టల్‌కు రూ.33.5లక్షలు, వీ.కోటకు రూ.23లక్షలు, పట్టణంలోని బాలికల హాస్టల్‌కు రూ.32.5లక్షలు, స్థానిక ఎస్సీ హాస్టల్–2కి రూ.21లక్షలు, ఎస్సీ–2 హాస్టల్‌కు రూ.33లక్షలు మంజూరైంది. ఈ ప్రాంతాల్లో చేస్తున్న పనులు నాసిరకంగా చేస్తున్నా అధికారపార్టీ నేతలు కావడంతో అధికారులు కిమ్మనడం లేదు. దీనిపై పలమనేరు, కుప్పం ఎస్‌డబ్ల్యూఓలు హైమవతి, మీనాక్షిని సాక్షి వివరణ కోరగా.. దీనిపై తాము ఎప్పటికప్పుడు హాస్టళ్లను సందర్శించి పనులు నాణ్యంగా సాగేలా చూస్తామన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకే పటిష్టంగా పనులు జరిగేలా చూస్తామన్నారు.

‘ఉపాధి’ కోసం వినతి

సదుం: ఉపాధి హామీ పథకంలో పనులు కల్పించాలని భారతీయ అంబేడ్కర్ సేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ సీతాపతి ఇన్‌చార్జి ఎంపీడీఓ హరిబాబు, ఏపీఓ శ్రీనివాసులుకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. మండలంలోని 18 పంచాయతీలలో దళితులు, ఆదివాసీలు, చిన్న, సన్న కారు రైతులకు ఉపాధి పనులను కల్పించాలని, ఎస్సీ కాలనీల్లో కూడా పనులు చేసేలా చూడాలని కోరారు.

యోగాపై ప్రచార వాహనంతో అవగాహన

కుప్పం: కుప్పం నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో యోగాపై అవగాహన కల్పించేందుకు యోగా వాహనాన్ని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ప్రారంభించారు. జూన్ 21న యోగా డే సందర్భంగా గ్రామాల్లో ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించడానికి శ్రీకారం చుట్టినట్టు పేర్కొన్నారు. గ్రామాల్లోకి వాహనం వచ్చినప్పుడు ప్రజలు యోగా శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యోగాచార్యులు గణేష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకే

తవణంపల్లె: మద్యం తాగి వాహనాలు నడిపితే కేసు నమోదు చేసి జైలుకు పంపుతానని ఎస్‌ఐ చిరంజీవి హెచ్చరించారు. మండలంలోని పటన్నం, ఎగువ తవణంపల్లె రోడ్డు, పోలీస్ స్టేషన్ వద్ద శుక్రవారం వాహనాలు తనిఖీ చేశారు. వాహనాలను మద్యం తాగి డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మద్యం తాగి డ్రైవింగ్ చేసి ప్రమాదాల బారిన పడితే సామాన్యుల ప్రాణాలు గాలిలో కలుస్తాయన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలన్నారు. రికార్డులు లేని వాహనాలను సీజ్ చేస్తామన్నారు. ఆటోలు అధిక లోడ్డుతో నడిపితే చర్యలు తీసుకొంటామన్నారు.ఎస్‌ఐతో పాటు హెచ్‌సీ అమీర్‌భాషా, సిబ్బంది పాల్గొన్నారు.

యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

తవణంపల్లె: జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ టి.హరిప్రసాద్ రెడ్డి తెలిపారు. జూన్ 21వ తేదీన జాతీయ యోగా దినోత్సవం విజయవంతం చేయడానికి మండలంలో యోగా చేయడానికి ఆసక్తి కలిగిన వారు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. మండలంలోని 17 సచివాలయాల్లో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది యోగా చేసే వారిని ప్రోత్సహించి రిజిస్ట్రేషన్ చేయించాలని పేర్కొన్నారు. ప్రతి సచివాలయంలో 50 మందికి తగ్గకుండా రిజిస్ట్రేషన్ చేయించాలని కోరారు. పంచాయతీ కార్యదర్శులు చొరవ తీసుకొని రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించాలని తెలిపారు. ప్రతి సచివాలయానికి ఒక యోగా టీచర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు.

మండల కన్వీనర్ ఇంట విషాదం



వేలు కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న ఎమ్మెల్సీ భరత్, నాయకులు



వేలు (ఫైల్)

శాంతిపురం: వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి సోదరుడు కేఎస్‌ఎం వేలు(46) శుక్రవారం హఠాన్మరణం చెందారు. కనుమలదొడ్డి టమాట మార్కెట్‌లో ప్రముఖ వ్యాపారిగా ఉన్న వేలు ఎడమ భుజం నొప్పిగా ఉందని స్థానిక ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లో చికిత్స పొందారు. అక్కడి నుంచి నేరుగా ఇంటికి వెళ్లి నిమిషాల వ్యవధిలోనే కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆయన మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య శివగామి, ఐదుగురు పిల్లలు ఉన్నారు. వేలు మరణ వార్త తెలిసిన ఎమ్మెల్సీ భరత్ మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, కుప్పం మండల కన్వీనర్ మురుగేష్, గుడుపల్లె మండల కో–కన్వీనర్ రామ్మూర్తి, నాయకులు పెద్దన్న, మునిరత్నం, విజయకుమార్ పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు వేలు మృతదేహానికి నివాళులు అర్పించారు.

ఘనంగా మాతమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన





ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లిస్తున్న మహిళలు , మాతమ్మ విగ్రహం

పెద్దపంజాణి: మండలంలోని బసవరాజుకండ్రిగలో మాతమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన, కుంభాభిషేకం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గురువారం సాయంత్రం రుత్వికులు గణపతి పూజ, రక్షాబంధనం, కలశ స్థాపన, శుక్రవారం ఉదయం ప్రాణప్రతిష్ఠ, అమ్మవారి ప్రధానహోమం, కుంభాభిషేకం, పంచామృతాభిషేకం, గోపూజ, మంగళ హారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. తీర్థప్రసాదం వినియోగం అనంతరం మాతమ్మ దేవత విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. మహిళలు పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించారు. తదుపరి బాట గంగమ్మ ఆలయాన్ని ప్రారంభించారు. కార్యనిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

సామాజిక ఎదుగుదలకు విద్య ఎంతో అవసరం



అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ నిర్మల

తవణంపల్లె: వ్యక్తిగత, సామాజిక ఎదుగుదలకు విద్య ఎంతో అవసరమని ఐరాల సీడీపీఓ నిర్మల కిశోర బాలికలకు సూచించారు. మండలంలోని చెంగనపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం సెషన్–7 కింద విద్య, ఓపెన్ స్కూల్ ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కిశోర బాలికలకు ప్రాథమిక విద్య ఎంతో అవసరం అన్నారు. విద్య స్థిరమైన, సంతోషకరమైన జీవితానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. బాలికలు పాఠశాలకు వెళ్లకుండా డ్రాపౌట్లు కాకుండా పాఠశాలలోని చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

మామిడి మద్దతు ధర కోసం ప్రణాళిక



రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ

గంగాధరనెల్లూరు: మామిడి రైతులకు మద్దతు ధర వచ్చేలా ప్రణాళికలు చేస్తే రైతులకు లాభదాయకంగా ఉంటుందని జిల్లా వ్యవసాయ అధికారి మురళీ కృష్ణ అన్నారు. గంగాధరనెల్లూరు మండల కేంద్రంలోని మోతరంగనపల్లి గ్రామంలో క్షేత్రస్థాయిలో మామిడి పంటపై సమీక్ష నిర్వహించి, రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే, జూన్, జూలై, ఆగస్టు నెలలో పంట దిగుమతిపై అంచనా వేసి ప్రణాళికలు సిద్ధం చేసుకుంటే రైతుకు మంచి మద్దతు ధర వచ్చి అధిక లాభదాయకంగా ఉంటుందని తెలిపారు. మండల, జిల్లా వ్యాప్తంగా ఎంత విస్తీర్ణంలో మామిడి సాగు ఉంది, ఎంత దిగుబడి వస్తుందనే దానిపై సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సైకిల్ ఎక్కనున్న కొత్త ముఖాలు..!

త్వరలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని టీడీపీలో సంస్థాగత పదవుల పందేరం మొదలైంది. అధ్యక్షుల ఎన్నికల్లో కొత్తవారికి స్థానం కల్పించే దిశగా దృష్టి సారించినట్టు తెలుస్తోంది గతంలో అవినీతి, అక్రమాల ఆరోపణలు ఉన్నవారిని పక్కనబెట్టి కొత్తవారికి పార్టీలోకి స్థానం కల్పించే దిశగా పూనుకున్నట్టు పరిణామాలు తేటతెల్లం చేస్తున్నాయి. దీంతో దశాబ్దాల కాలంగా టీడీపీ కోసం కష్టపడిన నేతలకంటే ఇటీవల కూటమి ద్వారా భాగస్వాములైన వారికే పెద్దపీట వేస్తున్నారని సీనియర్లు ఒకింత రగిలిపోతున్నారని సమాచారం.

- మొదలైన పదవుల పందేరం
- అక్రమాలకు పాల్పడిన వారిపై తప్పని వేటు
- అన్ని మండలాల్లో భారీగా ఆశావహులు
- ఇప్పటికే పూర్తయిన పంచాయతీ అధ్యక్షుల ఎన్నిక
- 27న కడప మహానాడులోపు కొత్త మండల అధ్యక్షులు ఖరారు



సంస్థాగత ఎన్నికలపై ఇటీవల మాట్లాడుతున్న పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి (ఫైల్)

పలమనేరు: పలమనేరు నియోజకవర్గంలో ఐదు మండలాలు, ఓ మున్సిపాలిటీ, 90 పంచాయతీలున్నాయి. ఇప్పటికే పంచాయతీ స్థాయిలో టీడీపీ అధ్యక్షులను ఎన్నిక తంతు ముగిసింది. ఈనెల 27న కడపలో జరిగే మహానాడులోపు మండల అధ్యక్ష, కార్యదర్శుల ఎంపిక చేసే పనిలో స్థానిక ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి ఉన్నట్టు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

పాతవారు ఔట్!

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతోంది. అంతకుముందు సైతం పార్టీ అధ్యక్షులుగా కొందరు పదేళ్లపాటు కొనసాగి ఇప్పటికీ వారే కొనసాగుతున్నారు. అయితే పార్టీ అధికారంలోకి వచ్చాక వీరిలో కొందరిపై అవినీతి ఆరోపణలు వచ్చాయి. ముఖ్యంగా ఇసుక అక్రమ రవాణా, గోకులం షెడ్లకు కమీషన్ల వసూలు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు చెరువుల్లో మట్టి తవ్వకాలు, బెల్టుషాపుల నుంచి వసూళ్లు,లాటరీ టిక్కెట్లు, గంజాయి అమ్మకాలు తదితరాల్లో వీరి హస్తం ఉన్నట్టు అదే పార్టీలోని ఓ ముఖ్యమైన సామాజికవర్గం పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. స్థానిక ఎమ్మెల్యేకు సైతం తెలియకుండా ఆయా మండలాల్లో భారీగా అవినీతి జరిగిందని, వీరినే మళ్లీ పార్టీ అధ్యక్షులుగా కొనసాగిస్తే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటమి తప్పదని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిసింది. దీనిపై ప్రజాభిప్రాయ సర్వే, ఇంటిలిజెన్స్ సమాచారం తెప్పించుకుని ఆపార్టీ జాతీయ కార్యదర్శి పరిశీలించినట్టు వాస్తవాలేమిటో తెలుసుకున్నట్టు సమాచారం.దీంతో పాతవారికి పదవులు ఊడడం ఖాయంగా కనిపిస్తోంది.

రగిలిపోతున్న నిజమైన నాయకులు

దశాబ్దాలుగా టీడీపీ కోసం కష్టపడిన నేతలకంటే ఇటీవల కూటమి ద్వారా భాగస్వాములైన వారికి పెద్దపీట వేయడం సీనియర్లలో తీవ్ర అసంతృప్తికి రాజేసింది. దీంతో పార్టీలో స్తబ్దంగా ఉంటున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులు తెలుసుకున్న ఎమ్మెల్యే కొత్తవారికే సంస్థాగత పదవులు కట్టబెట్టడం పార్టీకి మంచిదని భావించినట్టు తెలుస్తోంది. ఆ మేరకు ఆయా మండలాల్లోని పార్టీ క్యాడర్‌తో చర్చించి వారి అభిప్రాయాల మేరకు కొత్త అధ్యక్ష, కార్యదర్శులను మహానాడులోపు ఎంపిక చేసే పనిలో ఉన్నట్టు ప్రచారంలోకి వచ్చింది.

నకిలీ విత్తు.. రైతు చిత్తు

ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో రైతులు పంటల సాగులో నిమగ్నమయ్యారు. పొలాలకు ఎరువులు తోలడం, దుక్కులు దున్నడం ప్రారంభించారు. వాతావరణం అనుకూలించడంతో రైతులు విత్తనాలు చల్లే పనులకు పూనుకున్నారు. ఇదే అదనుగా పలువురు వ్యాపారులు రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని నకిలీ విత్తనాలను అంటగట్టేస్తున్నారు. ఈ నకిలీ విత్తనాలు నాటి పంట సాగు చేస్తే రైతు దిగుబడి రాక చిత్తయిపోవడం ఖాయం. ఈ నకిలీ విత్తనాలను గుర్తించాల్సిన తరుణమిదే!

- ఖరీఫ్‌కు సమాయత్తమవుతున్న రైతులు
- విత్తనాల కొనుగోలుపై అవగాహన తప్పనిసరి
- జాగ్రత్తలు పాటించాలంటున్న వ్యవసాయాధికారులు

బంగారుపాళెం: మండలంలో ఖరీఫ్ సీజన్‌లో ప్రధానంగా వరి, వేరుశనగ, మిరప ఎక్కువగా సాగు చేస్తుంటారు. వర్షాలు పుష్కలంగా కురిసే అవకాశాలు ఉండడంతో పంటల సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశాలున్నాయని వ్యవసాయాధికారులు భావిస్తున్నారు. ఈ సీజన్‌లో ఇదే అవకాశంగా కొందరు వ్యాపారులు తక్కువ ధరలో ఎక్కువ దిగుబడి ఇచ్చే విత్తనాలు తమ దుకాణాల్లో ఉన్నాయంటూ రైతులను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. అయితే ఇలా బురిడీ కొట్టించి, నకిలీ విత్తనాలు అంటగట్టి, రైతులను ముంచిన దుకాణదారులు లేకపోలేదు. ఏటా నకిలీ విత్తనాల బారిన పడి ఏటా అధిక సంఖ్యలో రైతులు నష్టపోతున్న నేపథ్యంలో రైతులు జాగ్రత్తలు తీసుకుంటే నకిలీ విత్తనాలను ముందే గుర్తించవచ్చు, నష్టపోయినా పరిహారం పొందవచ్చని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

–వ్యవసాయ శాఖ అనుమతి పొందిన దుకాణాల్లో మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి. కొన్ని చోట్ల ప్రభుత్వ అనుమతి లేని అనధికార విత్తన వ్యాపారులు తెల్లసంచుల్లో నకిలీ విత్తనాలను విక్రయించే అవకాశం ఉంది. వారి విషయంలో అప్రమత్తంగా ఉండడంతో పాటు వారి సమాచారాన్ని అధికారులకు తెలియజేస్తే వారిపై చర్యలకు అవకాశం ఉంటుంది.

– ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న సంస్థల నుంచే సర్టిఫైడ్ విత్తనాలు కొనుగోలు చేయాలి. కొనుగోలు చేసిన విత్తనాలకు సంబంధించి బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలి. బిల్లుపై రైతు చిరునామా, గడువు తేదీ, విత్తనం ధర, కంపెనీ పేరు, అమ్మినవారి సంతకం తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలి.

– విత్తన బస్తాపై ముద్రించిన ధ్రువపత్ర బిల్లు తమ పంట చేతికి వచ్చేవరకు రైతులు భద్రపరచుకోవాలి. విత్తనాలు కొన్న వెంటనే మొలక శాతం పరీక్షించుకోవాలి. కనీసం 75 శాతం మొలకలు ఉంటేనే వాటిని విత్తనంగా వినియోగించుకోవాలి. విత్తన సంచులను రైతులు నమూనా వివరాల కోసం పంట కోతకు వచ్చే వరకూ దాచుకోవాలి.

జాగ్రత్తలు పాటించాలి

ప్రభుత్వం నుంచి అనుమతి పొందిన వ్యాపారుల వద్దే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలి. ఒక వేళ నకిలీ విత్తనాలతో మోసపోతే వెంటనే వ్యవసాయాధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చు. విత్తనాలు నాణ్యమైనవి కాకపోవడం వల్లే దిగుబడి రాలేదని గుర్తిస్తే ఆ విత్తన కంపెనీపై మండల వ్యవసాయాధికారి ద్వారా జిల్లా వ్యవసాయ సంచాలకులకు ఫిర్యాదు చేసి పరిహారం పొందేందుకు వీలుంటుంది. దీనికోసం రైతులు తమ విత్తన కొనుగోలు బిల్లు భద్రపరచుకోవాలి.

–చిట్టిబాబు, ఏఓ, బంగారుపాళెం